సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 14 । మే । 2023



పర్యావరణ పరిరక్షణతో మేలు

పర్యావరణ పరిరక్షణ వల్ల మేలు చేకూరుతుందని పొక్కుపేట రేంజ్ అధికారి కరుణాకర్ పేర్కొన్నారు. 8లో



మండు వేసవిలోనూ మంచు

డుంబ్రిగుడ: మండు వేసవిలోనూ మంచు అందాలు కనువిందు చేశాయి. చాపరాయి జలపాతాన్ని మంచుతెరలు కమ్మేశాయి.



కొత్తపల్లి జలపాతం సందర్శన

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని శనివారం జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ కుటుంబ సభ్యులతో సందర్శించారు.

న్యూస్‌రీల్

లోక్‌అదాలత్‌లో 13 కేసులు పరిష్కారం


లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి ప్రవీర్ బాంజ్ డియో

అడ్డతీగల: రాజీకి వీలైన కేసులు పరిష్కారానికి లోక్‌అదాలత్ ఒక వేదిక వంటిదని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి ప్రవీర్ బాంజ్ డియో అన్నారు. అడ్డతీగల కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు.ఈ సందర్భంగా 13 కేసులు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. న్యాయవాదులు కేఎస్‌వీ రమణ, డి.శ్రీధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో మునిగి బాలుడు మృతి


బాలుడు అక్షిత్ మృతదేహం

కూనవరం: గోదావరి నదిలో మునిగి బాలుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుంది. బంధువుల కథనం ప్రకారం కూనవరం గ్రామం బెస్త బజారుకు చెందిన గుమ్మల సతీష్ కుమారుడు గుమ్మల అక్షిత్ (9) సాయిబాబాగుడి సమీపంలోని మెట్లరేవులో స్నానానికి వెళ్లి కాలుజారి నీటిలో పడిపోయాడు. అదే రేవులో దుస్తులు ఉతుకుతున్న ఒక మహిళ చూసి రక్షించే ప్రయత్నం చేసినా సాధ్యం కాకపోవడంతో గట్టిగా కేకలు వేసింది. గోదావరి గట్టుపైన ఉన్న కొందరు వ్యక్తులు వెళ్లి నీటి గాలించారు. బండరాళ్ల అడుగున ఉన్న బాలుడిని అష్టకష్టాలు పడి పైకి తీశారు. అప్పటికే మృతి చెందాడు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. వీరిలో కుమారుడు అక్షిత్ మృతి చెందాడు.

108లో ప్రసవం

మారేడుమిల్లి: ఓ గిరిజన మహిళ 108 అంబులెన్స్ శనివారం ప్రసవించింది. మండలంలోని సున్నంపాడు పంచాయతీ రామన్నపాలెం గ్రామానికి చెందిన గర్భిణీ వలల శ్రీలేఖకి పురిటినొప్పులు రావడంతో బంధువులు మారేడుమిల్లి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి రంపచోడవరం ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు అధికం కావడంతో ఆమెకు ఈఎంటీ వెంకట్రావు, పైలెట్ ధనుంజయ్ పురుడు పోశారు. ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు 108 సిబ్బంది తెలిపారు.

విద్యుదాఘాతానికి యువకుడి బలి


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

హుకుంపేట : వివాహానికి టెంటు వేసేందుకు వెళ్లిన యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ఎదురుగా ఓ వివాహ కార్యక్రమానికి టెంటు పని చేసేందుకు పాటిమామిడి గ్రామానికి చెందిన కిల్లో ప్రవీణ్‌కుమార్ (23) వచ్చారు. శనివారం పెళ్లింటి వద్ద టెంటు వేసేందుకు ఇనుప రాడ్డు పైకి ఎత్తడంతో ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగకు తగిలి యువకుడికి షాక్ కొట్టింది. దీనిని గమనించిన తోటి పనివారు, పెళ్లింటివారు వెంటనే అతనిని హుకుంపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య సేవలు నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స అందిస్తుండగానే ప్రవీణ్‌కుమార్ మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

చల్లని తల్లి మోదమ్మ

పాడేరు పట్టణం ఉత్సవ శోభతో మెరిసిపోతోంది. రాష్ట్రంలో అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మోదకొండమ్మ ఉత్సవాల నేపథ్యంలో విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా మారింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ, ఉత్సవ కమిటీలు ఏర్పాటుచేశాయి. ఉత్సవాల మూడురోజులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

- నేటి నుంచి మూడు రోజులు ఉత్సవాలు
- విద్యుత్ దీపాలతో అలంకరణ
- ఇతర రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తజనం
- ప్రత్యేక సర్వీసులు నడుపుతున్న ఆర్టీసీ


మోదకొండమ్మ తల్లి


పూజలు చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ


అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఇత్తడి ఘటాలను పూజలకు సిద్ధం చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: గిరిజనుల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహిమాన్వితం గల చల్లని తల్లిగా అమ్మవారిని భక్తులు విశ్వసిస్తుంటారు. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలోని సమ్మక్క, సారాలమ్మ తల్లి గిరిజన జాతర తరువాత పాడేరులోని మోదకొండమ్మతల్లి పండగ రెండవ గిరిజన జాతరగా గుర్తింపు పొందింది.

- జాతర సమయంలో లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివస్తుంటారు. ఈ ఏడాది మోదకొండమ్మతల్లి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ప్రముఖులను ప్రత్యేకంగా ఆహ్వానించారు.
- రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ యంత్రాంగం కూడా మోదకొండమ్మతల్లి గిరిజన జాతరను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లలో నిమగ్నమైంది.
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు అన్నిశాఖల అధికారులు ఉత్సవ ఏర్పాట్లలో భాగస్వాములయ్యారు.
- ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన, మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వర్తన పిన్నయ్యదొర, తమర్భ ప్రసాద్‌నాయుడు, నవర కొండబాబు, గౌరవ అధ్యక్షుడు కొట్టగుళ్లి సుబ్బారావు, ఇతర కమిటీ ప్రతినిధులు ఉత్సవాలు విజయవంతానికి ప్రణాళికపరంగా చర్యలు చేపట్టారు.

ఉదయం ఐదు గంటల నుంచి..

మోదకొండమ్మతల్లి జాతరను ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అధికార యంత్రాంగం, ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీల ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వం తరపున అమ్మవారికి కలెక్టర్ సుమిత్‌కుమార్ పట్టువస్త్రాలు సమర్పిస్తారు. టీటీడీ నుంచి కూడా అమ్మవారికి ప్రత్యేక వాహనంలో రానున్న పట్టువస్త్రాలను ప్రధాన పండగ మంగళవారం అమ్మవారికి సమర్పిస్తానని స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలనంతరం మోదకొండమ్మతల్లి ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇత్తడి ఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం సతకం పట్టు వద్ద ప్రతిష్టిస్తారు. మంగళవారం రాత్రి వరకు జాతర అంగరంగా వైభవంగా జరుగుతుంది.

- మెయిన్‌రోడ్డు నుంచి సతకం పట్టు వరకు ఆదివారం జరిగే ఊరేగింపు సంబరాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మోదకొండమ్మతల్లి ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థమై ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఆదివారం నుంచి నడుపుతుందని పాడేరు డిపోమేనేజర్ రోణంకి సీతారాంనాయుడు తెలిపారు. పాడేరు డిపోలో 44 బస్సులు ఉన్నాయి. వీటితోపాటు విశాఖపట్నం నుంచి అదనంగా మరో 12 బస్సులను రప్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇవి కాకుండా విశాఖపట్నం నుంచి 9, అనకాపల్లి నుంచి 3, మధురవాడ డిపో నుంచి ఒక బస్సు నడుస్తుందని ఆయన వివరించారు. గిరిజన ప్రాంతాలకు సంబంధించి రెగ్యులర్ బస్సు సర్వీసులతోపాటు అరకులోయ, చింతపల్లి, ముంచంగిపుట్టు ప్రాంతాలకు అదనంగా మూడేసి బస్సులు నడుపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

భారీ బందోబస్తు: ఎస్పీ


సూచనలిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అమ్మవారి ఉత్సవాల సందర్భంగా పాడేరు ప్రాంతంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.శనివారం ఆయన పాడేరు పట్టణంలో పలు ప్రాంతాలను సందర్శించారు. భద్రత చర్యలపై పాడేరు, చింతపల్లి ఏఎస్పీలు, ఇతర పోలీసు అధికారులతో సమీక్షించారు.అనంతరం మోదకొండమ్మతల్లి ఉత్సవ, ఆలయ కమిటీల ప్రతినిధులతో మాట్లాడారు. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నివర్గాలు సహకరించాలని ఆయన కోరారు.


ఆకట్టుకుంటున్న ముఖద్వారం


విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారి ఆలయం


ప్రత్యేక ఆకర్షణగా డిజిటల్ గేటు

● పురి విప్పిన మయూరంలా..


సుంకరమెట్ట చర్చి వద్ద కనువిందు చేస్తున్న ఎర్ర తురాయి చెట్టు

మన్యంలో ప్రకృతి అందాలకు కొదవలేదు. సీజన్ ఏదైనా తనివితీరా ఆస్వాదించవచ్చు. శీతాకాలంలో మంచు అందాలు కనువిందు చేస్తే.. వేసవి కాలంలో ఆకులు రాల్చిన చెట్లు, రంగు రంగులతో లేలేత చిగుళ్ల, పూలతో తురాయి చెట్ల అందాలు మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. వాన పడినా అందమే.. చుట్టూ ఉన్న కొండలను మేఘాలు కమ్మేసి దోబూచులాడుతుంటాయి. అందుకే ఆహ్లాదానికి ఏమాత్రం కొదవ ఉండదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెట్లన్నీ చిగురించడంతో విశాఖ– ఘాట్‌రోడ్డులోని పచ్చదనం పలకరిస్తోంది. అందుకే తీరిక దొరికితే మన్యంలో గడిపేందుకు ప్రకృతి ప్రేమికులు ఆసక్తి చూపుతుంటారు.

– అనంతగిరి


పరచుకున్న పచ్చదనం


పసిడి వర్ణంలో లేలేత చిగుళ్లతో..


పూలను తలపించేలా చిగురుటాకులు


కొండకోనల్లో మేఘాలు దోబూచులాట

మూడు నెలల పసికందు మృతి

ఇసుకగరువులో ఘటన


మృతి చెందడానికి కొన్ని గడియల ముందు పసికందు

హుకుంపేట: వింతలక్షణాలతో మూడు నెలల పసికందు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దుర్గం పంచాయతీ సరసుపాడు గ్రామానికి చెందిన సాయిబాబు, శాంతి ఇసుకగరువు గ్రామంలోని బంధువుల ఇంటి వద్ద ఉంటున్నారు. వీరికి మూడు నెలల క్రితం బాబు జన్మించాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఉన్నట్టుండి గట్టిగా ఏడుస్తూ, పిడికిలి బిగిస్తూ చనిపోయాడు. కాసేపటికే శరీరం మొత్తం నలుపు రంగులోకి మారిపోయిందని తల్లిదండ్రులు తెలిపారు. వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇలావుండగా దుర్గం పంచాయతీ బంగారంగరువులో ఒక చిన్నారి, ఓల్డా పంచాయతీ నిట్టాపుట్టు, నూర్పిరాయి గ్రామాల్లో ఇద్దరు చిన్నారులు వారం రోజుల గడువులో అవేలక్షణాలతో మృతి చెందారు. ఈ విషయాన్ని ఇసుకగరువు, ఉప్ప గ్రామాల గిరిజనులు తెలిపారు.ఆరు నెలలలోపు చిన్నారులు మృతి చెందుతున్నారని వారు పేర్కొన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించి చిన్నారుల మృతికి గల కారణాలు గుర్తించి, తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి

అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ


కోండ్రుంలో మహిళలకు హైజెనిక్ కిట్లు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పెదబయలు: మారు మూల గ్రామాల్లో సైతం ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడంతోపాటు వైద్య సేవలు అందిస్తోందని అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. శనివారం మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతం ఇంజరి పంచాయతీ కోండ్రుం గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సీజనల్ వ్యాధుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలోని మహిళలు, పురుషులకు హైజెనిక్ కిట్లు, మందులు, లుంగీలు, నైటీలు, సబ్బులు, మాస్కులు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితమని గర్భిణులకు సూచించారు. గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాల గ్రామస్తులు కోరారు. గుల్లేలు నుంచి కోండ్రుం, జక్కం నుంచి కోండ్రుం మార్గాల్లో పూర్తిస్థాయిలో తారు రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతి లభించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమస్యలన్నింటినీ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఎంపీడీవో పూర్ణయ్య, మండల ఇంజినీరింగ్ అధికారి సంజీవరావు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు జయలక్ష్మి, సూర్యారావు పాల్గొన్నారు.

అమ్మ ప్రేమ అమృతం

తోటకూర గింజలతో తల్లీబిడ్డ చిత్రం



మాకవరపాలెం: అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని తూటిపాల గ్రామానికి చెందిన బి.రవికుమార్ తోటకూర గింజలతో తల్లీబిడ్డ చిత్రాన్ని రూపొందించారు. మాతృమూర్తులందరికీ వందనం చెబుతూ 25 గంటల పాటు శ్రమించి 2,500 తోటకూర గింజలతో చిత్రాన్ని రూపొందించారు. సమాజహితంగా అనేక చిత్రాలను రూపొందించి రవికుమార్ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, మూర్తి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక చింతన అవసరమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోనిమాకవరం పంచాయతీ మేభ గ్రామంలో శనివారం పంచముఖ ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవం వేడుక ఘనంగా జరిగింది. ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ,మూర్తి దంపతులు ప్రారంభోత్సవం చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పూజలు చేశామన్నారు. ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అన్ని వేళల్లో సహాయ సహకారం ఉంటుందన్నారు. సనాతన ధర్మాలు, సంస్కృతి సంప్రదాయాలపై సంపూర్ణ అవగాహనతో చారిత్రక అంశాలు, కుటుంబ విలువలు పెంపొందించేందుకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం మేభ గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులకు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మామిడి పండ్ల కోసం చెట్టెక్కి...

విద్యాదాఘాతంతో ఇద్దరు చిన్నారులకు గాయాలు



విద్యుదాఘాతంతో తీవ్రంగా కాలిపోయిన యశ్వంత్ తేజ్

ముంచంగిపుట్టు : మామిడి పండ్ల కోసం చెట్టెక్కి విద్యుదాఘాతానికి గురై ఇద్దరు చిన్నారులు గాయాలపాలైన ఘటన మండలంలోని పెదగూడ పంచాయతీ జర్రిపడ గ్రామంలో జరిగింది. వివరాలివి. గ్రామానికి చెందిన కుర్తాడి ప్రసాద్ కుమారుడు హేమంత్, గబుడు రామారావు కుమారుడు యశ్వంత్ తేజ్‌లు శనివారం సాయంత్రం మామిడి చెట్టు ఎక్కి మామిడి పండ్లు తీస్తుండగా చెట్టుకు సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు తాకి విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో ఇద్దరూ చెట్టు నుంచి కింద పడిపోగా కుటుంబ సభ్యులు వారిని వెంటనే ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి వివేక్‌నాయక్, వైద్య సిబ్బంది వారికి చికిత్స అందించారు. కాళ్లు, చేతులు, ముఖం తీవ్రంగా కాలిపోయి చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవలు నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. విషయం తెలుసుకున్న పెదగూడ సర్పంచ్ బాబు రావు చిన్నారులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

మత్స్యగెడ్డలో దూకి మతిస్థిమితం లేని మహిళ మృతి



మత్స్యగెడ్డలో హేమవతి మృతదేహం

ముంచంగిపుట్టు : మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రం సమీపంలో మత్స్యగెడ్డలో మహిళ మృతదేహం లభ్యమైంది. శనివారం ఉదయం మత్స్యగెడ్డలో మహిళ మృతదేహం తేలుతూ ఉండడాన్ని సుజనకోట గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్‌ఐ రవీంద్ర, తహసీల్దార్ నర్సమ్మలు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతురాలు మండలంలో గల జర్రెల పంచాయతీ మండిభ గ్రామానికి చెందిన సుంక్రి హేమవతి (50)గా గుర్తించారు. కుటుంబ సభ్యులకు అధికారులు సమాచారం అందించగా హేమవతి కుమారుడు ప్రసాద వచ్చి మృతురాలిని తన తల్లిగా గుర్తించారు. కొంత కాలంగా తన తల్లికి మతిస్థిమితం సరిగా లేదని, శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇంటి వద్ద ఆరా తీసిన అచూకీ లభ్యం కాలేదని తెలిపాడు. ఆమె మతిస్థిమితం లేక మత్స్యగెడ్డలో దూకి చనిపోయి ఉంటుందని కుమారుడు ప్రసాద్ రాతపూర్వకంగా పోలీసులకు తెలియజేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆపన్నులను ఆదుకోవడంలోనే సంతృప్తి



వైఎస్సార్‌సీపీ నేత అప్పలస్వామిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, నేతలు

అరకులోయ రూరల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలోనే సంతృప్తి కలుగుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని బస్కి పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అప్పలస్వామి గత రెండు నెలలుగా అనారోగ్యంతో ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ నాయకులతో కలిసి శివారు గ్రామం భంసుగూడలో నివాసముంటున్న అప్పలస్వామిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ అప్పలస్వామికి మెరుగైన వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర్ స్వామి, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్‌కుమార్, ఏఎంపీ చైర్మన్ కిల్లో రాజారమేష్ బోస్, ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, సర్పంచ్ పాడి రమేష్, నగేష్ తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణతో మేలు

రంపచోడవరం: ప్రతిష్ఠాత్మక నిర్వహించ తలపెట్టిన పర్యావరణ హితజీవన శైలి, లైఫ్ స్టయల్ ఫర్ ఎన్విరామెంట్‌లో భాగంగా పోక్సుపేట రేంజ్ పరిధిలో వివిధ కార్యక్రమాలను శనివవారం నిర్వహించారు. పాతరామవరం, నెల్లిపూడి గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేంజర్ కరుణాకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడం, వృక్ష సంపదను పరిరక్షించాలన్నారు. పర్యావరణానికి విఘాతం కలిగించే పదార్థాలను వినియోగించొద్దన్నారు. ప్ల కార్డులు, బ్యానర్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకర జీవనశైలికి అనుసరిస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎఫ్‌ఎస్‌ఓ నూకరాజుదొర, జగదీష్, మాణిక్యం, పద్మ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు. మారేడుమిల్లిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రెజ్లర్లకు మద్దతుగా నిరసన

తుమ్మపాల: భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్, ఏజెవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన చేపట్టారు. జిల్లా కార్యదర్శులు ఫణీంద్ర, రాజు మాట్లాడుతూ దేశ ప్రతిష్ఠను ప్రపంచమంతా చాటు తున్న మహిళా రెజ్లర్లపై లైంగిక చర్యలకు పాల్పడిన వారిని శిక్షించాలన్నారు. మహిళా రెజ్లర్లు నిరసన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలన్నారు.

ఏలేరు కాలువలో గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం

కశింకోట: ఉగ్గినపాలెం గ్రామం వద్ద ఏలేరు కాలువలో గల్లంతైన వృద్ధుని మృతదేహం శనివారం లభ్యమైనట్టు అదనపు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. తాళ్లపాలెం గ్రామానికి చెందిన తనకాల అప్పారావు(63) ఉగ్గినపాలెం వెళ్లి అక్కడి ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ కాలుజారి పడి గల్లంతైన సంగతి తెలిసిందే. ప్రమాద స్థలానికి కొంత దూరంలో మృతదేహం తేలడంతో కాలువ నుంచి వెలికి తీసి పోస్టుమార్టం కోసం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.